ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU
శనివారం 16 మార్చి 2024

తమిళ సంస్కృతికి ప్రధాన శత్రువు డీఎంకే

● దేశాన్ని దోచుకోవడమే ఇండియా కూటమి లక్ష్యం ● కన్నియాకుమారి సభలో ప్రధాని మోదీ ధ్వజం


కన్నియాకుమారి సభలో ప్రజలకు ప్రధాని అభివాదం

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమిళ సంస్కృతికి ప్రధాన శత్రువు డీఎంకే పార్టీయేనని, గతకాలపు తమిళుల ప్రాచీన విశిష్ట సంప్రదాయాలను గుడ్డిగా వ్యతిరేకించడమే ఆ పార్టీ ప్రధాన ఆశయమని, ఈ విషయంలో సుప్రీంకోర్టు సైతం రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించిందని ప్రధాని నరేంద్రమోదీ ధ్వజమెత్తారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి అగస్తీశ్వరం వివేకానంద కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం ఏర్పాటైన బీజేపీ బహిరంగ సభలో సహోదర సహోదరిగళే అంటూ ప్రసంగం ప్రారంభించిన మోదీ... రాష్ట్రంలో డీఎంకే కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఇక, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, డీఎంకే కూటమి పత్తాలేకుండా పోతాయన్నారు. తమిళ సంస్కృతిని బీజేపీ ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుతుందన్నారు. రాష్ట్రంలో డీఎంకేని ఓడించి బీజేపీ పాలనను ఏర్పాటు చేస్తామన్నారు. డీఎంకే - కాంగ్రెస్ పార్టీలు ఇండియా కూటమిలో ఉండటం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దేశంలోని ప్రధాన ప్రతిపక్షాలన్నీ ప్రజలను దోచుకునేందుకే అధికారంలోకి రావాలని ఆరాటపడుతున్నాయని చెప్పారు. తమిళనాట ఇండియా కూటమిలో 2జీ అవినీతి అక్రమాలకు పాల్పడినవారే ఉన్నారని చెప్పారు. ప్రజల సొమ్ము దోచుకోవడమే వారి ప్రధాన ఆశయమని ధ్వజమెత్తారు. ప్రజలకు 5జీ వంటి సేవలను అందించటం, డిజిటల్ ఇండియాను సమర్థవంతంగా అమలుచేయటం బీజేపీ ప్రభుత్వ ప్రధాన ఆశయమన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తే, ఇండియా కూటమిలో దేశ భద్రతతో చెలగాటమాడేలా హెలికాప్టర్ల కొనుగోలులో జరిపిన భారీ కుంభకోణమే ఉందన్నారు. ఖేలో ఇండియా ద్వారా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభాపాటవాలను తాము ప్రపంచానికి ఎలుగెత్తి చాటితే, డీఎంకే- కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ఒలంపిక్ క్రీడలలో భారీస్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో రూ.50వేల కోట్లతో రహదారులను నిర్మించిందని, రూ.70 వేల కోట్ల అంచనాతో రహదారి నిర్మాణ పనులు చేపడుతోందని ఆయన వివరించారు. అదే విధంగా రాష్ట్రంలో రైల్వే పనులకు రూ.6300 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. జాలర్ల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం పాటుపడుతుందని, వావుసి ఓడరేవును అభివృద్ధి పరిచామన్నారు. జల్లికట్టుకు డీఎంకే - కాంగ్రెస్ కూటమి నిషేధించాయని, బీజేపీ ప్రభుత్వమే దాన్ని తొలగించిందని చెప్పారు. తమ పార్టీ కన్నియాకుమారి ప్రజలను ప్రేమిస్తోందని, డీఎంకే, కాంగ్రెస్ కూటమి ద్వేషిస్తోందన్నారు.

జయ పట్ల ఎలా ప్రవర్తించారో అందరికీ తెలుసు....

మహిళా సంక్షేమానికి పాటుపడుతున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న డీఎంకే.. మాజీ ముఖ్యమంత్రి జయలలిత పట్ల ఎలా ప్రవర్తించారో దేశ ప్రజలందరికీ తెలుసని మోదీ అన్నారు. తమిళనాటు మహిళలపై రోజురోజుకూ వేధింపుల కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేని రాష్ట్రంగా మారుతోందని మోదీ చెప్పుకొచ్చారు.

ఇక తమిళంలో నా ప్రసంగం...

తాను తరచూ తమిళనాట పర్యటిస్తున్నా తమిళభాషను చక్కగా మాట్లాడలేకపోతున్నానని, ఇకపై తన హిందీ ప్రసంగాన్ని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తమిళంలో వెనువెంటనే అనువాదం చేసి అందించే సదుపాయం నమో యాప్ ద్వారా లభిస్తుందని మోదీ చెప్పారు. ఈ సభలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పార్టీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఇటీవల పార్టీలో చేరిన నటుడు శరత్‌కుమార్, రాధిక శరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే విజయధరణి తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం...

వేర్పాటువాదుల నుంచి దేశాన్ని కాపాడటం ప్రధాని నరేంద్రమోదీ తప్ప ఇతరులవల్ల సాధ్యం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. మోదీకి కన్నియాకుమారి మధ్య విడదీయలేని అనుబంధం ఉందని, 1991లో మురళీమనోహర్ జోషీ నాయత్వంలో జరిగిన ఏక్తాయాత్రలో పాల్గొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నటుడు శరత్‌కుమార్ ప్రసంగిస్తూ ... మోదీ మూడోసారి ప్రధాని కావడం తథ్యమని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు పాటుపడతానని చెప్పారు.

మోదీ వ్యతిరేకంగా నల్లజెండాల ప్రదర్శన

● ఎంపీ విజయవసంత్ సహా 160 మంది అరెస్టు



నల్లజెండాల ప్రదర్శనలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ విజయవసంత్ తదితరులు

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి పౌరసత్వ చట్టాన్ని తీసుకువచ్చిన ఎన్డీయే ప్రభుత్వ తీరును ఖండిస్తూ, ప్రధాని మోదీ కన్నియాకుమారి రాకను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్లజెండాల ప్రదర్శన జరిగింది. కన్నియాకుమారి సీమంప తక్కలై తపాలా కార్యాలయం ఎదుట జరిగిన ఈ ప్రదర్శనకు కాంగ్రెస్ ఎంపీ విజయవసంత్ నాయకత్వం వహించారు. శాసనసభ్యులు రాజేష్‌కుమార్, ప్రిన్స్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బిను లాల్‌సింగ్ సహా 200 మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు. నల్లజెండాలు పట్టుకుని ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఎంపీ విజయవసంత్ సహా 160 మందిని అరెస్టు చేసి సమీపంలోని కల్యాణమండపానికి తరలించారు. ఆ సందర్భంగా ఎంపీ విజయవసంత్ విలేఖరులతో మాట్లాడుతూ దేశ ప్రజలను కులం, మతం వారీగా విభజించే దిశగానే కేంద్రంప్రభుత్వం ఉమ్మడి పౌరసత్వ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. 'గోబ్యాక్ మోదీ' నినాదంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నల్లజెండాల నిరసన ప్రదర్శన విజయవంతమైందని ఆయన తెలిపారు.

డీఎంకేలో 500 మంది చేరిక

అన్నాడీఎంకే నుంచి వైదొలిగి


డీఎంకేలో చేరిన అన్నాడీఎంకే నిర్వాహకులతో ముఖ్యమంత్రి స్టాలిన్, రాష్ట్ర మంత్రులు

ప్యారీస్, మార్చి 15: మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సహా 500 మంది అన్నాడీఎంకే నుంచి వైదొలిగి శుక్రవారం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో అన్నాడీఎంకే మాజీ ఎంపీ పీటీ ఇళంగోవన్, మాజీ ఎమ్మెల్యే కలైసెల్వన్ నేతృత్వంలో డీఎంకేలో చేరిన వారికి స్టాలిన్ వేదికపైనే పార్టీ సభ్యత్వ గుర్తింపుకార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్, కోశాధికారి, ఎంపీ టీఆర్ బాలు, మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, సీవీ గణేశన్, ఎమ్మెల్యే లక్ష్మణన్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానకర్త కుమార్తెకు అరుదైన బహుమతి

● చిన్నారి జన్మదినాన్ని జరిపిన వైద్యులు


చిన్నారి సాన్యాసాన్వితో రాజీవ్‌గాంధీ ఆసుపత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు

పెరంబూర్, మార్చి 15: అవయవ దానం ద్వారా పలువురికి పునరుజ్జీవనం ప్రసాదించిన యువకుడి రెండేళ్ల కుమార్తెకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు అరుదైన బహుమతినిచ్చారు. ఆమె జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. అరక్కోణం సువాల్‌పేటకు చెందిన మహేష్‌కుమార్(26) - నిర్మల దంపతులకు రెండేళ్ల సాన్యాసాన్వి అనే కుమార్తె ఉంది. ఈ నేపథ్యంలో, ఈ నెల 4వ తేది జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్‌కుమార్‌కు రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రిలో వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించారు. చికిత్స ఫలించక ఈనెల 6వ తేది మహేష్ మెదడు నిర్జీవం కావడంతో, కుటుంబసభ్యుల అంగీకారంతో గుండె, కాలేయం, మూత్రపిండాలు తదితర అవయవాలను దానం చేశారు. అనంతరం మహేష్‌కుమార్ మృతదేహానికి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నివాళి అర్పించారు. ఈ నేపథ్యంలో, మహేష్‌కుమార్ కుమార్తె సాన్యాసాన్వి ఈనెల 12వ తేది జన్మదినం జరుపుకుంది. సమాచారం తెలుసుకున్న రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రి అవయవాల మార్పిడి కమిషన్ సభ్యుల కార్యదర్శి డాక్టర్ ఎన్.గోపాలకృష్ణన్ నేతృత్వంలో డాక్టర్ కవిత, అత్యవసర చికిత్సా విభాగం డీన్ డాక్టర్ గోమతి, అనస్తీషియా విభాగం సహాయ ప్రొఫెసర్ జయంతి నేతృత్వంలో 15మంది వైద్య విద్యార్థులు తిరుత్తణిలోని నిర్మల ఇంటికెళ్లి, సాన్యాసాన్విచే కేక్ కట్ చేయించారు. చిన్నారికి అందరూ వేర్వేరుగా బహుమతులు అందజేశారు.

రాష్ట్రంలో నాలుగు కొత్త కార్పొరేషన్లు

● సీఎం స్టాలిన్ ఉత్తర్వు

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం మధ్యాహ్నం ఉత్తర్వు జారీ చేశారు. ఆ మేరకు ప్రస్తుతం పురపాలక సంఘాలుగా ఉన్న పుదుకోట, నామక్కల్, తిరువణ్ణామలై, కారైక్కుడికి కార్పొరేషన్ స్థాయి కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో నగరాల్లో నివసించేవారి సంఖ్య యేటా విపరీతంగా పెరుగుతోందని, ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 53 శాతానికిపైగా ప్రజలు నగరాలు, సబర్బన్ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పరిస్థితుల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన సదుపాయాలు కల్పించడానికి పురపాలక సంఘాలను కార్పొరేషన్లుగా స్థాయిని పెంచాల్సి వస్తోందన్నారు. ఆ ప్రకారం మూడేళ్లలో కొత్తగా 28 పురపాలక సంఘాలను, తాంబరం, కాంచీపురం, కడలూరు, కుంభకోణం, కరూరు, శివకాశి కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో చారిత్రిక నగరం పుదుకోట, ఆలయ నగరం తిరువణ్ణామలై, పారిశ్రామిక నగరం నామక్కల్, విద్యా నగరం కారైక్కుడి పురపాలక సంఘాలను కార్పొరేషన్లుగా స్థాయిని పెంచినట్లు తెలిపారు. పుదుకోట పురపాలక సంఘం దాని చుట్టూ ఉన్న 11 నగర పంచాయతీలను కలిపి పుదుకోట కార్పొరేషన్‌గాను, తిరువణ్ణామలై పురపాలక సంఘం దాని చుట్టూ ఉన్న 18 నగర పంచాయితీలను అన్నామలై దిగువ ప్రాంతాలను కలిపి తిరువణ్ణామలై కార్పొరేషన్‌గా స్థాయిని పెంచినట్లు వివరించారు. ఇదే రీతిలో నామక్కల్ పురపాలక సంఘం, దానిచుట్టూ ఉన్న 12 నగర పంచాయతీలను విలీనం చేసి నామక్కల్ కార్పొరేషన్‌గాను, కారైక్కుడి పురపాలక సంఘంతో పాటు రెండు నగర పంచాయతీలు, ఐదు గ్రామ పంచాయతీలను విలీనం చేసి కారైక్కుడి కార్పొరేషన్‌గా స్థాయిని పెంచినట్లు స్టాలిన్ తెలిపారు. కొత్తగా ఏర్పాటైన ఈ నాలుగు కార్పొరేషన్లకు ప్రభుత్వం చాలినంత నిధులను కేటాయించి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించనుందని ఆయన పేర్కొన్నారు.

ఆగని శ్రీలంక నావికాదళం ఆగడాలు

● 15 మంది జాలర్ల అరెస్టు
● విడిపించాలని కేంద్రమంత్రికి సీఎం లేఖ

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమ దేశ సరిహద్దు సముద్రజలాల్లో చొరబడ్డారంటూ శ్రీలంక నావికాదళం రాష్ట్రానికి చెంది న 15 మంది తమిళ జాలర్లపై దాడులు జరిపి అక్రమంగా నిర్బంధించింది. ఈ సంఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని ప్రకటించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అరెస్టయిన జాలర్లను విడుదల చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలంటూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు లేఖ రాశారు. కారైక్కాల్ కిలింజల్ మేడు సునామీకరై ప్రాంతానికి చెందిన మురుగానందం అనే వ్యక్తికి చెందిన మరపడవలో ఈనెల 13న నాగపట్టినం టాటానగర్, మైలాడుదురైకి, పుదుకోట, కారైక్కాల్‌కు చెందిన 15 మంది జాలర్లు మైలట్టి అనే ప్రాంతం వద్ద చేపలుపడుతుండగా గస్తీ నౌకలో అక్కడికి వచ్చిన శ్రీలంక నావికాదళం చుట్టుముట్టి మరపడవను స్వాధీనం చేసుకుంది. జాలర్లను కాంగేశన్ రేవు వద్దకు తీసుకెళ్లింది. ఈ సంఘటన గురించి తెలుసుకున్న జాలర్ల కుటుంబీకులు జాలర్ల సంఘం నాయకులకు, రాష్ట్ర మత్స్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

మతఛాందస బీజేపీని తరిమికొడదాం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై


సత్యాగ్రహం ప్రారంభిస్తున్న సెల్వపెరుందగై


ప్యారీస్, మార్చి 15: కులమతాలను రెచ్చగొట్టి విధ్వంసాలు సృష్టిస్తున్న మతఛాందస బీజేపీని రాజకీయాల నుంచి తరిమికొట్టాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై పిలుపునిచ్చారు. ఎగ్మూర్‌లోని రాజరత్తినం స్టేడియం సమీపంలో మోదీ పాలనను గద్దె దింపుదాం...రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో టీఎన్‌సీసీ ఎస్సీ విభాగ అధ్యక్షుడు రంజన్‌కుమార్ నేతృత్వంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సత్యాగ్రహ పోరాటాన్ని సెల్వపెరుందగై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిటీష్ పాలకుల అధీనంలో ఉన్న దేశాన్ని మహాత్మాగాంధీ సత్యాగ్రహం అనే పోరాటాన్ని అహింసా మార్గంలో చేపట్టి విజయం సాధించారని, మహాత్ముడి కృషివల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మతవాద బీజేపీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి వెళ్లగొట్టాల్సిన అవసరం వచ్చిందని, క్రైస్తవులు, ఇస్లామీయులతో కలసి అన్ని వర్గాల ప్రజలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అనే ఆయుధం ద్వారా ఇండియా కూటమిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ఎస్.రాజేష్‌కుమార్, 58 జిల్లాల పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొని, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆలయాల్లో భక్తులకు మజ్జిగ పంపిణీ షురూ


తంబుచెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్న శేఖర్‌బాబు

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుప్రసిద్ధ ఆలయాల్లో మజ్జిగ పంపిణీ పథకానికి శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు శ్రీకారం చుట్టారు. ప్యారీస్ కార్నర్ తంబుచెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయంలో ఈ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని 578 సుప్రసిద్ధ ఆలయాల్లో ఈ వేసవిలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. అలాగే భక్తులను ఎండలో నిలబెట్టకుండా కొబ్బరి ఆకులతో పందిళ్లు ఏర్పాటు చేయాలని, కాలినడక మార్గంలో, ఆలయ ప్రదక్షిణ మార్గంలో కూలింగ్ పెయింటింగ్ వేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. డీఎంకే ప్రభుత్వ పాలనలోనే ఆలయాలన్నీ కొత్త రూపు సంతరించుకున్నాయని, భక్తులకు మెరుగైన సదుపాయాలు లభిస్తున్నాయనడం అతిశయోక్తి కాదని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్యాతికతకు వ్యతిరేకి కాదని, ఆధ్యాత్మికవాదులంతా మెచ్చుకునేలా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు కుంభాభిషేకాలు జరిపిస్తున్నారని తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ ఎం.మోహన్ ఆచ్చారి. బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
శనివారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.27
ఆదివారం : సహర్ : ఉదయం -4.35



విద్యార్థుల ఓటరు గుర్తింపు కార్డుల నెంబర్ల సేకరణ

● గవర్నర్ రవి ఆదేశం
● విచారణ జరిపించాలంటున్న విద్యావేత్తలు

అడయార్, మార్చి 15: రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లుగా ఉన్న విద్యార్థుల గుర్తింపుకార్డుల నెంబర్లను అందజేయాలని రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి మౌఖిక ఆదేశా లు జారీ చేశారు. దీంతో విద్యా సంస్థల అధికారులు ఆ వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. గవర్నర్ ఆదేశాలపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదే విషయంపై సంఘ సేవకుడు ప్రిన్స్ గజేంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో చదువుకుంటూ ఓటు హక్కువున్న విద్యార్థుల ఓటరు గుర్తింపుకార్డుల నంబర్లను సేకరించి ఇవ్వాలని గవర్నర్ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం, ఆ నెంబర్లను కూడా తక్షణం పంపించాలని కోరడంతో విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లు అన్ని కాలేజీలకు సర్క్యులర్‌ను పంపించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఒకవేళ ఈ అంశం వివాదానికి దారితీస్తుందని తెలియడంతో సర్క్యులర్ ఉపసంహరించుకున్నప్పటికీ.. ఇలాంటివి అసాధారణ చర్యలతో సమానమన్నారు. ఇలాంటి ఆదేశాల వెనుక ఉన్న మర్మమేంటని ఆయన ప్రశ్నించారు. యూనివర్శిటీలకు ఏమాత్రం సంబంధం లేని పనులను వర్శిటీలతోనే ఎందుకు చేపట్టారనే అంశంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రజలను కేవలం ఓటర్లుగా చూస్తున్న గవర్నర్ చర్య తీవ్రంగా ఖండించదగినదన్నారు. పార్టిసిపేటివ్ డెమొక్రసీ, ఫంక్షనల్ డెమొక్రసీ అనే పదాలకు గవర్నర్‌గా ఎలా అన్వయించుకుంటున్నారో అర్థకావడం లేదన్నారు. కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారా? లేదా అనే విషయాలను పట్టించుకోకుండా విద్యార్థులకు కేవలం ఒక ఓటర్లుగానే పరిగణించి వారి గుర్తింపు కార్డు నెంబర్లను సేకరించాలని కోరడం ఎంతమేరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఒకవైపు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు ఆటంకాలు సృష్టిస్తూ, ఓటర్ల కర్తవ్యం కేవలం ఓట్లు వేయడానికి మాత్రమే అనే భావన కల్పించే ధోరణితో గవర్నర్ వ్యవహారశైలి ఉందన్నారు. భారత రాజ్యాంగ పరిధిని అధికమించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా రాష్ట్ర గవర్నర్ వ్యవహారశైలి ఉందన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం లోతుగా విచారణ జరించాలని ఆయన కోరారు.

సమాచార దర్శిని

నేడు వ్యాస, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

పెరంబూర్, మార్చి 15: స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాస, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం శనివారం ఉదయం 10 గంటలకు జరగనుంది. నిడమర్తి వసుందరాదేవి ప్రార్థనతో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు డాక్టర్ ఎంవీ నారాయణ గుప్తా స్వాగతం పలకనున్నారు. కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి, విశిష్ట అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర, ఆత్మీయ అతిథిగా టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య హాజరుకానున్నారు. కమిటీ సభ్యులు డాక్టర్ ఏవీ శివకుమారి సభా నిర్వహణ బాధ్యతలు నిర్వహించనుండగా, సంయుక్త కార్యదర్శి శశికళ వందన సమర్పణ చేయనున్నారు.

ల్యాబ్ అసిస్టెంట్లకు పీరియడ్లు కేటాయించండి

ఐసిఎఫ్, మార్చి 15: ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్ అసిస్టెంట్లకు పీరియడ్లు కేటాయించాలని పాఠశాల విద్య డైరెక్టర్ అరివొళి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో 4 వేల మందికి పైగా ల్యాబ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. విద్యార్థులు ప్రాక్టికల్ తరగతుల్లో పాల్గొనే సమయంలో వారికి వీరు సహాయం చేస్తుంటారు. పలు పాఠశాలల్లో వీరికి ల్యాబ్ పనులు కేటాయించకుండా నిర్వహణ పనులు పురమాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రాక్టికల్ శిక్షణ తరగతులకు సంబంధించిన పనులు మాత్రమే చెప్పాలని, వారి కోసం టైం టేబుల్‌లో పీరియడ్లు కేటాయించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మద్దతు ధర పథకంలో కొబ్బరి, మినుము

ఐసిఎఫ్, మార్చి 15: ఈ ఏడాది మద్దతు ధర పథకంలో మినుములు, పెసలు, ఎండు కొబ్బరి కొనుగోలు చేయాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 25 జిల్లాల్లో ఉన్న 75 విక్రయ కేంద్రాల ద్వారా గత ఏడాది 48,364 మంది రైతుల నుంచి 79,021.80 టన్నుల కొబ్బరిని రూ.858.176 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కొబ్బరి 90,300 టన్నులు కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. వీటితో పాటు మినుములు, పెసలు కొనుగోలు చేయనున్నారు. ఈ కొనుగోలు శుక్రవారం నుంచి జూన్ 10వ తేది వరకు జరగనున్నాయి.

20, 21 తేదీల్లో మోస్తరు వర్షాలు

పెరంబూర్, మార్చి 15: రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. శుక్రవారం నుంచి 19వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొంటుంది. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు పెరగనున్నాయి. రాజధాని నగరంలో చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, పగటి ఉష్ణోగ్రతలు 34-35, రాత్రి ఉష్ణోగ్రతలు 25-26 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశముంది

38 మంది డీఎస్పీలకు పదోన్నతి

ఐసిఎఫ్, మార్చి 15: రాష్ట్ర పోలీసు శాఖలో 38 మంది డీఎస్పీలకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల 57 మంది ఇన్‌స్పెక్టర్లు డీఎస్పీలుగా పదోన్నతులు పొందారు. వారికి ఇంకా ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేయలేదు. ఈ నేపథ్యంలో, 38 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కొడైకెనాల్‌లో కార్చిచ్చు

ఐసిఎఫ్, మార్చి 15: కొడైకెనాల్ అటవీ ప్రాంతంలో కార్చిచ్చు ఏర్పడడంతో అరుదైన చెట్లు దగ్ధమయ్యాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో అప్పుడప్పుడు అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం అసన్‌కొడై అటవీ ప్రాంతంలో కార్చిచ్చు ఏర్పడిందని, మంటలు వ్యాపించడంతో ప్రభుత్వ రెవెన్యూ భూములు, ప్రైవేటు తోటల్లో పలు ఎకరాల్లో పంటలు, అరుదైన చెట్లు కాలిపోయాయని అధికారులు తెలిపారు. 50కి పైగా అగ్నిమాపక వాహనాలతో మంటలు ఆర్పుతున్నామని పేర్కొన్నారు.

జనవరిలో 1.37 లక్షల విదేశీ పర్యాటకుల రాక

ఐసిఎఫ్, మార్చి 15: రాష్ట్రంలోని పర్యాటక స్థలాలు సందర్శించేందుకు జనవరిలో 1.37 లక్షల మంది విదేశీయులు వచ్చారని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. కరోనా అనంతరం 2021లో 57,622గా ఉన్న విదేశీ పర్యాటకుల సంఖ్య 2022లో 4,07,139గాను, 2023లో 11,74,899లకు పెరిగిందన్నారు. 2024 జనవరిలో మాత్రమే 1,37,563 మంది విదేశీ పర్యాటకులు వచ్చారని, రాష్ట్రంలో పర్యాటక శాఖ చేపడుతున్న అభివృద్ధి పనులు, కల్పిస్తున్న వసతులు కారణంగా పర్యాటకులు వస్తున్నారని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ పుష్పరాజ్ తెలిపారు.

ఆవిన్ నెయ్యి ధర రాయితీ పొడిగింపు

ఐసిఎఫ్, మార్చి 15: ఆవిన్ నెయ్యిపై ఇస్తున్న రాయితీ ఈ నెలాఖరు వరకు పొడిగించారు. ఆవిన్ సంస్థ పాలతో పాటు నెయ్యి, వెన్న, పెరుగు, పన్నీరు రకాలను 10 వేలకు పైగా పార్లర్లు, చిల్లర దుకాణాల ద్వారా విక్రయిస్తోంది. ఆవిన్ నెయ్యి మూడు నెలలుగా లీటరుకు రూ.50 రాయితీ ధరకు విక్రయిస్తున్నారు. ప్రజాదరణ దృష్టిలో పెట్టుకొని ఈ రాయితీ ఈనెల 31వ తేది పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

20నుంచి టెన్త్ హాల్ టిక్కెట్లు

పెరంబూర్, మార్చి 15: టెన్త్ పబ్లిక్ పరీక్షల హాల్‌టిక్కెట్లు ఈనెల 20వ తేది నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ పేర్కొంది. టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 26వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు 12,616 పాఠశాలలకు చెందిన 4.52 లక్షల మంది విద్యార్థినులు సహా మొత్తం 9.10 లక్షల మంది హాజరుకానున్నారు. వీరి కోసం 4,107 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రామనాథస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.87 కోట్లు

పెరంబూర్, మార్చి 15: రామేశ్వరం రామనాథస్వామి ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామివారికి రూ.1.87 కోట్ల నగదును కానుకలుగా సమర్పించారు. ఈ ఆలయ హుండీల లెక్కింపు గురువారం ఆలయ జాయింట్ కమిషనర్ ఎస్.శివరామ్‌కుమార్ నేతృత్వంలో అమ్మవారి సన్నిధి సమీపంలో మండపంలో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.1,87,03,816 నగదు, 106 గ్రాముల బంగారం, 12 కిలోల వెండి, 274 విదేశీ కరెన్సీ నోట్లను కానుకలుగా సమర్పించారని ఆలయ జాయింట్ కమిషనర్ తెలిపారు.

● ఎలిఫెంట్‌గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి

ఒక వైపు రహదారి ప్రారంభం



వాల్‌టాక్స్ రోడ్డు - రాజా ముత్తయ్య రోడ్డు ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు, ఎంపీ దయానిధిమారన్

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ రాయపురం జోన్ 57వ వార్డు పరిధిలోని ఎలిఫెంట్ గేట్ ప్రాంతంలో రూ.71.26 కోట్లతో నిర్మిస్తున్న ఎలిఫెంట్‌గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) పనుల్లో ఇటీవల ముగిసిన ఓ వైపు రహదారిని రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, సెంట్రల్ చెన్నై ఎంపీ దయానిధి మారన్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ ఎలిఫెంట్‌గేట్ ఆర్ఓబీ సెంట్రల్ రైల్వేస్టేషన్, బేసిన్‌బ్రిడ్జి రైల్వేస్టేషన్ల నడుమ ఉన్న రైలు పట్టాల రహదారులపై ఉంది. ఈ ఆర్ఓబీ మార్గం వాల్‌టాక్స్ రోడ్డును రాజా ముత్తయ్య రోడ్డును కలిపే రహదారిగా ఉంది. గతంలో ఈ రహదారిలో రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఉండిన 50 మీటర్ల ఆర్ఓబీ కూల్చివేసి 156.12 మీటర్లతో కొత్త బ్రిడ్జి నిర్మించారు. అదే విధంగా ఈ ఫ్లైఓవర్‌కు ఇరువైపులా 364.23 మీటర్ల ఏటవాలు రహదారి నిర్మాణ పనులను జీసీసీ చేపట్టింది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.30.78 కోట్లతో వాల్‌టాక్స్ రోడ్డు వైపున 165.24 మీటర్ల పొడవు రహదారి, రాజా ముత్తయ్య రోడ్డు వైపున 198.99 మీటర్ల పొడవు రహదారి నిర్మాణ పనులు జరిగాయి. అదే సమయంలో రైల్వేశాఖ రూ.40.48 కోట్లతో రైలు పట్టాల మార్గంపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతోంది. ఈ ఇరువైపు మార్గాల్లో వాల్‌టాక్స్ రోడ్డు నుంచి రాజా ముత్తయ్యరోడ్డు వైపు వెళ్లే రహదారి నిర్మాణ పనులు, రైల్వే ఆర్ఓబీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీనితో ఆ వైపు వెళ్లే ఫ్లైఓవర్ మార్గాన్ని శుక్రవారం ఉదయం ప్రజల ఉపయోగార్థం తెరిచారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్. ప్రియ, డిప్యూటీ కమిషనర్ (పనులు) డాక్టర్ జీఎస్ సమీరాన్ తదితరులు పాల్గొన్నారు.

కోవైలో ప్రధాని మోదీ రోడ్ షోకు అనుమతి



కుమరి సభలో శరత్‌కుమార్, రాధికను మోదీకి పరిచయం చేస్తున్న పొంగులేటి

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో ప్రధాని మోదీ రోడ్ షోకు పోలీసు శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో, మద్రాసు హైకోర్టు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోయంబత్తూర్ పార్లమెంటు నియోజక వర్గంలో బీజేపీ రెండు సార్లు విజయం సాధించింది. దీంతో, ఈ నియోజకవర్గంపై ఆ పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ, ఈనెల 18వ తేది కోయంబత్తూరులో నిర్వహించే 'రోడ్ షో'లో పాల్గొననున్నారు. ఆ రోజున ప్రధాని మోదీ, టాపులేని కారులో 3.5 కి.మీల దూరం పాల్గొనేలా ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రధానికి ప్రత్యేక భద్రత, పరీక్షల సమయం అంటూ కారణాలు చూపి కోవై నగర పోలీసు శాఖ రోడ్‌షోకు అనుమతి నిరాకరించింది. దీంతో, బీజేపీ తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దానిపై విచారణ జరిపిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్... రోడ్ షోకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, సాయంత్రం 5 గంటలకు రోడ్ షో జరగనుండడంతో పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రధాని భద్రతను ఎస్పీజీ సైనికులు చూసుకుంటారని, పోలీసు శాఖ వారికి సహకరిస్తే చాలన్నారు.

రెండు బైకుల ఢీ: ఇద్దరి మృతి



మృతులు సతీష్, తనికాచలం (ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు సమీపంలో రాట్టినంకినరు వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లా కాలేజీ విద్యార్థి సహా ఇద్దరు మృతి చెందారు. చెంగల్పట్టు ప్రభుత్వ న్యాయ కళాశాలలో చదువుతున్న రామనాథపురం జిల్లా కముదికి చెందిన సతీష్ (21), తంజావూరుకు చెందిన సాయికృష్ణన్, గోకుల కన్నన్ తన ఇద్దరు స్నేహితులను వెంటబెట్టుకుని గురువారం రాత్రి బైకులో బయలుదేరారు. ఆ బైకు రాట్టినంకినరు వద్ద వెళ్తుండగా అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో బైకును ఢీకొంది. ఆ రెండు బైకులు రోడ్డుపై నడిచి వెళుతున్న తాపీ కార్మికుడు తనికాచలంను ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో సతీష్, తనికాచలం మృతి చెందారు. బైకుల్లో ప్రయాణించిన ముగ్గురు తీవ్రంగా గాయపడి చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చెంగల్పట్టు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

నూతన పద్ధతిలో బంగారం అక్రమ తరలింపు

● స్వాధీనం చేసుకున్న అధికారులు



ఛార్జర్ పిన్నుల్లా రూపొందించిన బంగారం

పెరంబూర్, మార్చి 15: నూతన పద్ధతిలో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి మదురై అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం రాత్రి వచ్చిన స్పైస్ జెట్ విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారు లు తనిఖీ చేపట్టారు. వారిలో ఒకరిని అనుమానించిన అధికారులు, అతనిని ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి క్షుణ్ణంగా పరిశీలించినా ఏమీ లభించలేదు. అయినా అనుమానంతో అధికారులు అతని వస్తువులు పరిశీలించారు. వాటిలో సెల్‌ఫోన్ ఛార్జర్ పిన్నుల్లో బంగారం ఉండడం గుర్తించారు. ఈ ఘటనలో రూ.6,60,500 విలువైన 100 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని, రామనాథపురం జిల్లా దేవిపట్టణానికి చెందిన విజయ్ ఆనంద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

గురునానక్ కాలేజీలో అంతర్రాష్ట్ర కాలేజీ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీజీపీ శంకర్‌జివాల్

అడయార్, మార్చి 15: స్థానిక వేళచ్చేరిలోని గురునానక్ కాలేజీలో అంతర్రాష్ట్ర ఇంగ్లీష్, తమిళం పోటీల్లో విజేతలకు రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో లయోలా కాలేజీ, విద్యా సాగర్ కాలేజీ ఫర్ ఉమెన్, ఎస్ఆర్ఎం యూనివర్శిటీ, వడపళని సిటీ క్యాంపస్, డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, సవీత మెడికల్ కాలేజీ, రంగస్వామి కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, యూనవర్శిటీ ఆఫ్ మద్రాస్, రాజధాని కాలేజీ, ది న్యూ కాలేజీతో సహా దాదాపు 47 కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. తమిళనాడు పోలీస్ అండ్ తమిళ్ హోం గార్డ్స్, గురునానక్ సెంటర్ ఫర్ కన్సల్టెన్సీ అండ్ ఔట్‌రీచ్ సహకారంతో ఈ అంతర్‌రాష్ట్ర పోటీలను నిర్వహించారు.

ప్లస్ టూ పరీక్షకు 13,075 మంది గైర్హాజరు

పెరంబూర్, మార్చి 15: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగిన ప్లస్‌టూ పబ్లిక్ పరీక్ష కు 13,075 మంది గైర్హాజరయ్యారు. ఎకనామిక్స్, కంప్యూటర్ టెక్నాలజీ, ఎంప్లాయబిలిటీ స్కిల్ పాఠ్యాంశాల్లో నిర్వహించిన పరీక్షకు 7,77,305 మంది హాజరయ్యారు.

పళని గిరి మార్గంలో తివాచీలు



భక్తుల కోసం ఏర్పాటుచేసిన తివాచీలు

ఐసిఎఫ్, మార్చి 15: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయ వెలుపలి ప్రాకారం, గిరి మార్గంలో వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఎండ నుంచి ఉపశమనం కలిగించే తివాచీలు ఏర్పాటు చేశారు. పంగుణి ఉత్తర ఉత్సవాలు జరగనుండడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వస్తున్నారు. వీరి కోసం గిరి వీధిలో వించ్ స్టేషన్ నుంచి పాద వినాయక ఆలయం, మండపం వరకు నారతో తివాచీలు దారి పొడవునా పరిచారు. అప్పుడప్పుడూ వీటిపై నీటిని పిచికారీ చేస్తున్నారు. ఎండ తీవ్రత తగ్గే వరకు వీటిని అలాగే ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

మురుగన్ విగ్రహం లభ్యం



నదిలో బయల్పడిన విగ్రహం

ఐసిఎఫ్, మార్చి 15: తిరువళ్లూర్ జిల్లా తిరువాలంగాడు యూనియన్ పాకశాల కుశస్థలి నది తీరంలో మురుగన్ విగ్రహం బయల్పడింది. ఈ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఆడుకోడానికి వెళ్లిన పిల్లలు, మట్టిలో కూరుకుపోయిన విగ్రహాన్ని గుర్తించారు. ఈ సమాచారం తెలుసుకున్న తిరుత్తణి తహసీల్దార్, అధికారులతో వెళ్లి ఇసుకలో ఉన్న 3.5 అడుగుల ఎత్తు, 150 కిలోల బరువు కలిగిన రాతి విగ్రహాన్ని వెలికి తీశారు. శిరస్సుపై కిరీటం, నాలుగు చేతులు, రెండు కాళ్లు కలిగిన ఈ విగ్రహం క్రీ.శ 12వ శతాబ్దానికి చెందినదని పురావస్తు పరిశోధకులు తెలిపారు. ఈ విగ్రహాన్ని చెన్నై ఎగ్మూర్‌లో ఉన్న మ్యూజియంకు అప్పగించారు.

ఎన్నికల కంట్రోల్ రూం ప్రారంభం



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్

వేలూరు, మార్చి 15: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటైంది. కార్యాలయ రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ గదిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, జిల్లా కలెక్టర్ పీఏ(ఎన్నికల శాఖ) సెల్వరాజ్, ఎన్నికల తహసీల్దార్ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'విరింజిపురం ఆలయ చరిత్ర' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న బాలమురుగన్ అడిమై స్వామి

వేలూరు, మార్చి 15: విరింజిపురంలోని మార్గబంధీశ్వర ఆలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 'మార్గబంధీశ్వరుడు ఆలయ చరిత్ర, సిద్ధులు తెలిపిన మాటలు, మంత్రోపదేశాలు, దైవిక విషయాలు' పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో న్యాయవాది బాలచందర్, రత్నగిరి ఆలయ మాజీ మేనేజర్ శివనార్ అముదు, విరింజిపురం ఆలయ ట్రస్టీ రాజగోపాల్, జిల్లా ప్రైవేటు బస్సుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కైలాస్ పాల్గొనగా, ముఖ్యఅతిథిగా రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం



ప్రసంగిస్తున్న పన్నీర్‌సెల్వం

ప్యారీస్, మార్చి 15: రైతుల సంక్షేమమే డీఎంకే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం పేర్కొన్నారు. థౌజండ్ లైట్స్ నియోజకవర్గం జెమినీ ఫ్లై ఓవర్ సమీపంలో సెమ్మొళి పార్కు ప్రాంగణంలో రూ.25 కోట్లతో నిర్మితమవుతున్న కలైంజర్ సెంటినరీ పార్కు పనులను శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి అపూర్వ, డైరెక్టర్ మురుగేశ్ తదితర ఉన్నతాధికారులతో కలసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన వన శాఖలో పని చేసి మృతిచెందిన ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగ నియామక ఉత్తర్వులను మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కలైంజర్ సెంటినరీ పార్కులో 400 మీటర్ల పొడవు, 13 మీటర్ల వెడల్పు, 12 మీటర్ల ఎత్తుతో అద్దాల భవంతి ఏర్పాటు చేస్తున్నామని, 2025 ఫిబ్రవరికి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

మదురైలో వెంకటేశన్, దిండుగల్‌లో సచ్చిదానందం

ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం



పెరంబూర్, మార్చి 15: లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం తరఫున పోటీచేయనున్న అభ్యర్థులను శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. డీఎంకే నేతృత్వంలోని కూటమిలో సీపీఎంకు మదురై, దిండుగల్ నియోజకవర్గాలు కేటాయించారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ మాట్లాడుతూ... తమకు కేటాయించిన స్థానాల్లో పోటీచేసే అభ్యర్థుల గురించి కార్యవర్గ సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఆ ప్రకారం, మదురైలో ఎస్.వెంకటేశ్, దిండుగల్‌లో సచ్చిదానందం పోటీచేస్తారని ఆయన ప్రకటించారు.

గురువులను గౌరవించడం మంచి సంప్రదాయం

● ఏఐటీఎఫ్ అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ

ప్యారీస్, మార్చి 15: తమకు విద్యాబుద్ధులు నేర్పించి జీవితంలో ఉన్నతవంతులుగా తీర్చిదిద్దే గురువులను గౌరవించ డం మంచి సంప్రదాయమని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్), తమిళనాడు లింగ్విస్టిక్ మైనార్టీస్ ఫోరం అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ సీఎంకే రెడ్డి పేర్కొన్నారు. విజయవాడకు చెందిన మాజీ ఎమ్మెల్సీ వనమా శివదుర్గాప్రసాద పుల్లారావు, ప్రముఖ గాయని జ్ఞానప్రసూన దంపతుల పేరుతో స్థాపించి న వనమా ఆర్ట్స్, మద్రాసు వర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆంత్రోపాలజీ సంయుక్త ఆధ్వర్యంలో 'కల్చరల్ ఆన్ క్రాస్ రోడ్స్' అనే అంశంతో ఏర్పాటుచేసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. వనమా ట్రస్ట్ నిర్వాహకురాలు, నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల హిస్టారికల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ప్రభుకుమారి వనమా ఆహ్వానం పలుక గా, వర్శిటీ ఆంత్రోపాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎంపీ దామోదరన్ అతిథులను పరిచయం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎంకే రెడ్డి, చెన్నై సీపీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండోలాజికల్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ డీజే సుదాకర్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని, అదే విధంగా వివిధ పోటీల్లో పాల్గొని తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ వేడుకల్లో తమిళనాడు డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్శిటీ డైరెక్టర్, ప్రొఫెసర్ కేఎస్ శర్వాణి, ఒడిశా ఉత్కల్ యూనివర్శిటీ హిస్టరీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పరమేశ్వర్ సాహు, ఎం.రాజం, యతిరాజ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మద్రాసు యూనివర్శిటీ నిర్వాహకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలాపూర్‌లో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, మార్చి 15: స్థానిక మైలాపూర్ కపాలేశ్వర ఆలయ పంగుణి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం నుంచి 25వ తేది వరకు ట్రాఫిక్ మార్పులు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు.

● ఆలయ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఆలయం మీదుగా వచ్చే వాహనాలకు అనుమతి నిషేధం

● రాయపేట హైరోడ్డు నుంచి లజ్ జంక్షన్ మీదుగా అడయార్ వెళ్లే వాహనాలు లజ్ చర్చి రోడ్డు - సిల్వా రోడ్డు - భక్తవత్సలం రోడ్డు - రంగా రోడ్డు - సీపీ రామస్వామి రోడ్డు - కామరాజర్ రోడ్డు - శ్రీనివాస అవెన్యూ - ఆర్కే మఠం రోడ్డు మీదుగా గ్రీన్‌వేస్ జంక్షన్ చేరుకోవాలి.

●అడయార్ నుంచి లజ్ జంక్షన్ మీదుగా రాయపేట వెళ్లే వాహనాలు ఆర్కే మఠం రోడ్డు, తిరువెంకటం వీధి, వెంకటకృష్ణా రోడు, శృంగేరి మఠం రోడ్డు, వారన్ రోడ్డు, రంగా రోడ్డు, కర్పగాంబాల్ నగర్, శివస్వామి రోడ్డు, రాయపేట హైరోడ్డు మీదుగా వెళ్లాలి.

● ఆళ్వార్‌పేట జంక్షన్ నుంచి లజ్ జంక్షన్ మీదుగా వెళ్లే వాహనాలు ఆలివర్ రోడ్డు, శివస్వామి రోడ్డు జంక్షన్, వివేకానంద కళాశాల, రాయపేట హైరోడ్డు మీదుగా వెళ్లాలి.

● అధికార నంది, రథోత్సవం, అరువత్తిమూవర్ ఉత్సవాలు జరిగే రోజుల్లో నాలుగు మాడ వీధులు, రామకృష్ణ మఠం రోడ్డు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు అనుమతి లేదు.

వాహన పార్కింగ్ ప్రాంతాలు...

● ఈస్ట్ అభిరామపురం నుంచి వచ్చే భక్తుల వాహనాలు సాయిబాబా ఆలయం సమీపంలో వెంకటేశ్ అగ్రహారం, తిరుమయిలై ఎమ్మార్టీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలో పార్క్ చేయవచ్చు.

● రాయపేట హైరోడ్డు నుంచి మైలాపూర్ కొలను మీదుగా వచ్చే భక్తుల వాహనాలు లజ్ చర్చి రోడ్డు, కామధేను కల్యాణ మండపం ఎదుట పార్క్ చేయాలి.

● సెయింట్ మేరీస్ రోడ్డు మందవెల్లి వీధి నుంచి వచ్చే వాహనాలు పీఎస్ స్కూల్ సమీపంలోని కపాలేశ్వరాలయ మైదానంలో పార్క్ చేయాలి.

● పోలీసు శాఖ వాహనాలు సుందరేశ్వర వీధిలో ఉన్న రసిక రంజని సభ ప్రాంగణంలో పార్క్ చెయ్యొచ్చు.

నేడు పంగుణి ఉత్సవాలు

ఐసిఎఫ్, మార్చి 15: స్థానిక మైలాపూర్ కపాలేశ్వర ఆలయం, తిరువాన్మియూర్ మరుందీశ్వర ఆలయాల్లో ఈనెల 16న శనివారం నుంచి పంగుణి ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ఉదయం 7 నుంచి 7.30 గంటల్లోపు కపాలేశ్వర ఆలయంలో ధ్వజారోహణం, ఆదివారం ఉదయం 8.30 గంటలకు వెళ్లి సూర్య వట్టం, రాత్రి 9 గంటలకు చంద్ర వట్టం సేవలు జరగనున్నాయి. 22వ తేది రథోత్సవం జరుగుతుంది. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి కపాలేశ్వరస్వామి భక్తులకు దర్శనమిస్తారు. 23వ తేది తిరుజ్ఞాన సంబంధర్ సాక్షాత్కారం, 24వ తేది ఐమ్‌తిరుమేనిగల్ ఉత్సవం, 25న తీర్థవారి, ఆరోజు రాత్రి 7గంటలకు తిరుకల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. అలాగే, తిరువాన్మియూర్ మరుందీశ్వర ఆలయ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం రాత్రి 8.30 గంటలకు ధ్వజారోహణ ం, 22వ తేది చంద్రశేఖర రథోత్సవం, 23న పార్వేట ఉత్సవం, 25న త్యాగరాజర్ తిరుకల్యాణం, 26న తెప్పోత్సవం జరగనున్నాయి.

నేడు పూర్వ విద్యార్థుల సమాగమము

పెరంబూర్, మార్చి 15: స్థానిక రాజధాని కళాశాల తెలుగుశాఖ పూర్వ విద్యార్థుల సమాగమము శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కళాశాల ప్రాంగణంలోని పావెల్ హాల్‌లో జరగనుంది. ఎంఏ మొదటి సంవత్సరం విద్యార్థిని కె.అనురాధ ప్రార్థనతో ప్రారంభం కానున్న సమావేశానికి రచయిత, కవి, జర్నలిస్టు డాక్టర్ టి.వెంకటప్పయ్య ఆహ్వానం పలకనున్నారు. రాజధాని కళాశాల తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షత జరగనున్న ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ (ఇన్‌చార్జి) డాక్టర్ ఓ.ఆర్.దేవనాథన్ హాజరుకానున్నారు. శ్రీ వి.రామకృష్ణ ఉన్నత మాధ్యమిక పాఠశాల పీజీటీ (తెలుగు) ఉపాధ్యాయులు డాక్టర్ డి.ప్రమీల వందన సమర్పణ చేయనున్నారు. ఈకార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

● రెండాకుల గుర్తు వ్యవహారం

నేడు తీర్పు వెలువరించనున్న ఢిల్లీ హైకోర్టు

పెరంబూర్, మార్చి 15: రెండాకుల గుర్తుకు సంబంధించిన కేసులో ఢిల్లీ హైకోర్టు శనివారం తీర్పు వెలువరించనుంది. రెండాకుల గుర్తు, అన్నాడీఎంకే జెండా వినియోగానికి సంబంధించిన ఫిర్యాదులపై ఎన్నికల సంఘం సత్వరం చర్యలు చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం మద్దతుదారులు పుహళేంది ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు 2017 నుంచి విచారణ సాగుతోంది. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వెలువరించనున్నట్లు న్యాయమూర్తి సచిన్ దత్తా ప్రకటించారు.

ఈడీ అధికారి అంకిత్ తివారి బెయిల్ పిటిషన్ తోసివేత

పెరంబూర్, మార్చి 15: ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అంకిత్ తివారి బెయిలు పిటిషన్‌ను రెండో సారి హైకోర్టు మదురై బెంచ్ తోసిపుచ్చింది. ప్రభుత్వ వైద్యుడి వద్ద లంచం తీసుకున్నారనే కేసులో అరెస్టయిన అంకిత్ తివారి బెయిలు కోరుతూ చేసుకున్న దరఖాస్తును ఇదివరకే హైకోర్టు మదురై బెంచ్ తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో, అంకిత్ తివారి బెయిలు కోరుతూ రెండో సారి దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తి వివేక్‌కుమార్ సింగ్ విచారించారు. ఈ సందర్భంగా అధికారులు లంచం తీసుకొనే ఘటనలు పెరగడం దేశాభివృద్ధికి మంచిది కాదని వ్యాఖ్యానించి, ఈడీ అధికారి బెయిలు పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

33 నెలల్లో మదురై ఎయిమ్స్ నిర్మాణం పూర్తి

పెరంబూర్, మార్చి 15: మదురై తోప్పూర్‌లో 221 ఎకరాల్లో నిర్మిస్తున్న ఎయిమ్స్ ఆసుపత్రిని 33 నెలల్లో పూర్తి చేయనున్నట్లు ఎల్ అండ్ టీ సంస్థ తన వెబ్‌సైట్‌లో అధికారికంగా పేర్కొంది. మదురై ఎయిమ్స్ భవన నిర్మాణ పనులను టెండరు ద్వారా ఎల్ అండ్ టీ సంస్థ చేజిక్కించుకుంది. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 720 పడకల వసతితో కూడిన ఆసుపత్రి, 150 పడకలతో అంటువ్యాధుల నిరోధక విభాగం, 30 పడకలతో ఆయుష్ విభాగం, 150 సీట్లతో వైద్యకళాశాల, నర్సింగ్ కళాశాల, 750 మంది కూర్చొనేలా ఆడిటోరియం, వసతి గృహం, క్వార్టర్స్ తదితరాలను 33 నెలల్లో పూర్తి చేయనున్నట్లు ఎల్ అండ్ టీ పేర్కొంది.

మంత్రిగా పొన్ముడి ప్రమాణానికి ఎలాంటి చిక్కుల్లేవు

● స్పీకర్ అప్పావు

పెరంబూర్, మార్చి 15: ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చినా, మంత్రిగా పొన్ముడి పదవీ ప్రమాణం చేయడంలో న్యాయపరమైన చిక్కులు ఉండవని స్పీకర్ అప్పావు తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మంత్రిగా పొన్ముడిచే పదవీప్రమాణం చేయబోతున్న సమయంలో ఇదివరకే ఖరారైన పర్యటన నిమిత్తం గవర్నర్ ఢిల్లీ వెళ్లారని భావిస్తున్నామని తెలిపారు. ఆయన వచ్చిన తర్వాత మంత్రిగా పొన్ముడితో పదవీప్రమాణం చేయిస్తారని నమ్మకం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు, పొన్ముడి మంత్రి పదవి చేపట్టేందుకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న సమయంలో, రాజస్థాన్ రాష్ట్రంలో ఒకరు మంత్రిగా పదవీ ప్రమాణం చేశారని స్పీకర్ గుర్తుచేశారు.

ఆదనకోటలో అట్టహాసంగా జల్లికట్టు



చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా గంధర్వకోట సమీపం ఆదనకోటలో మేట్టు మునీశ్వరాలయ మాసి ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం జల్లికట్టు నిర్వహించారు. పుదుకోట తహసీల్దార్ భరణి జెండా ఊపి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 100 మంది యువకులు పాల్గొన్నారు. పెరంబలూరు, అరియలూరు, తంజావూరు, సేలం, మదురై, తిరుచ్చి జిల్లాల నుంచి తెప్పించిన 700 ఎద్దులు వాడి టవాసల్ నుంచి రంకెలేసుకుంటూ పరుగులు తీశాయి. వాటిని అణచేందుకు యువకులు పోటీపడ్డారు. విజేతలకు సైకిళ్లు, స్టీలు మంచాలు, ప్లాస్టిక్ కుర్చీలు, బంగారు కాసులను అందజేశారు. ఇదే విధంగా పోటీల్లో ఎవ్వరికి చిక్కకుండా తప్పించుకున్న ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. సాయంత్రం 4గంటల వరకూ ఈ పోటీలు కొనసాగాయి.

తరుణి



నేటి వైజ్ఞానిక యుగంలో కొత్త వ్యాధులు త్వరితగతిని వ్యాప్తి చెందుతూ శాస్త్రవేత్తలకు సవాళ్లు విసురుతున్నాయి. వాటిని జయించేందుకు అనువైన మందులు కనిపెడుతూ శాస్త్రవేత్తలు అహరహం శ్రమిస్తున్నారు. తయారైన మందులు నాణ్యత, భద్రత పరిశీలించేందుకు ఆయా కంపెనీల్లో రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ శాఖలు పని చేస్తుంటాయి. మందులే కాకుండా వైద్యపరికరాల భద్రత కూడా పరిశీలిస్తుంటాయి. అలాంటి శాఖలో పని చేస్తున్నారు డాక్టర్ పద్మప్రియ. వైద్యం ఆమె వృత్తి అయితే, నాట్యగానాలు ఆమె ప్రవృత్తులు. వైద్యం చదివేందుకు ఎంత నిబద్ధతతో శ్రమించారో, భరతనాట్యం, కర్ణాటక సంగీతం అభ్యసించేందుకు కూడా అంతగా పరిశ్రమ చేశారు. బహుముఖప్రజ్ఞాశాలి నేటి మన 'తరుణి' డాక్టర్ పద్మప్రియ. ఆమె వృత్తి, ప్రవృత్తుల జీవన ప్రస్థానం...- (వేళచ్చేరి)

బోధన... శిక్షణ

నైతిక విలువలకు, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తారు పద్మప్రియ. వేదం, నమకం, చమకం మొదలైన వెన్నో నేర్చుకున్నారు. సత్యసాయి సేవా సమితి నిర్వహించే బాలవికాస్ తరగతులలో పిల్లలకు భజనలు, శ్లోకాలు, పాటలు నేర్పిస్తుంటారు. శని, ఆదివారాల్లో విరామ సమయాన్ని బాలవికాస్ తరగతులతో సద్వినియోగం చేస్తుంటారు. బోధన ఇష్టపడే పద్మప్రియకు నైతిక విలువలు, మానవీయ విలువలు కథల ద్వారా పిల్లలకు చెప్పడంపై ఆసక్తి ఎక్కువ. అభిరుచి ఉన్న పిల్లలకు భరత నాట్యంలో కూడా శిక్షణ ఇస్తారు.



వృత్తి వైద్యం... ప్రవృత్తి నాట్యం

● డాక్టర్ పద్మప్రియ ప్రస్థానం

పద్మప్రియ పుట్టింది, పెరిగింది హైదరాబాదులో. మెట్టింది చెన్నైలో. సుభద్ర ఆమె తల్లి, తండ్రి మదన్‌మోహనరావు. తండ్రి వృత్తి వ్యాపారం. ఇక పద్మప్రియ సోదరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

విద్యాభ్యాసం...

పద్మప్రియ టెన్త్ వరకు హైదరాబాదులోని సెయింట్ ఆనీస్ హైస్కూలో చదివారు. నలందా ఇనిస్టిట్యూట్‌లో ఇంటర్మీడియట్ చేశారు. ఆపైన డెక్కన్ కాలేజి ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆ తర్వాత క్లినికల్ రీసెర్చిలో ఎమెస్సీ చదివారు. అంతేకాకుండా మేనేజ్‌మెంట్‌లో పీఎంపీ, పీజీఎంపి అనే రెండు సర్టిఫికెట్ కోర్సులు కూడా పూర్తిచేశారు. ఇది ఆమె వృత్తికి సంబంధించిన చదువులు. బాల్యంలో చదువుతో బాటే నాట్యానికి, సంగీతానికి శ్రీకారం చుట్టారు. ఆమెకు భరతనాట్యంపై అభినివేశం మిన్న. మూడో తరగతి చదివే చిరుప్రాయంలోనే భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించి 12 సంవత్సరాల పాటు కొనసాగించారు. వేదికలపై నూరుకు పైగా భరతనాట్య ప్రదర్శనలిచ్చి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. హైదరాబాద్‌లో ఎన్నో దేవాలయాలు, శివమ్, రవీంద్రభారతి మొదలైన చోట్ల తన నాట్యంతో మైమరపించారు. ఇక సంగీతానికి కూడా చిన్న వయసులోనే నాంది పలికారు పద్మప్రియ. కర్ణాటక గాత్ర సంగీతంలో ప్రఖ్యాత గురువుల వద్ద 13 సంవత్సరాలపాటు శిక్షణ తీసుకున్నారు. హైదరాబాదు నగరంలో పలుచోట్ల కచేరీలు చేశారు. 'స్వర మాధురి' పేరుతో తన చెల్లి, మరో సోదరితో కలసి ఎన్నో సంగీత ప్రదర్శనలిచ్చి శ్రోతలను రంజింపజేశారు.



శ్రీ సత్యసాయి సాయి సేవా ఆర్గనైజేషన్ సభ్యులతో..

జనరల్ మేనేజర్‌గా...

వైద్యానికి సంబంధించి ప్రతినిత్యం కొత్త ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటున్నాయి. మందుల తయారీలో, వైద్యపరికరాలలో కొత్త సృష్టి జరుగుతున్నది. అవి అన్నీ మార్కెట్లోకి వచ్చే ముందు భద్రత, నాణ్యతలకు సంబంధించి ఎన్నో పరీక్షలు ఎదుర్కొంటాయి. అవి నిర్వహించే శాఖ ఎంతో కీలకమైనది. అటువంటి ముఖ్యమైన పరిశోధన, అభివృద్ధి శాఖలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించడం క్లిష్టమైనా, కష్టమైనా ఎంతో సమర్థతతో నిర్వహిస్తున్న పద్మప్రియ మెడికల్ లిటరేచర్ చదివి అసెస్‌మెంట్, డాక్యుమెంటేషన్ చేస్తుంటారు. కార్యాలయంలో వృత్తికి, విధులకు ప్రాధాన్యమిచ్చే ఆమె ఇంటి వద్ద సమాజ సేవకు పెద్దపీట వేస్తారు.

అవార్డు స్వీకరిస్తూ...



మాధవ సేవ...

డాక్టర్ పద్మప్రియ సాయి భక్తురాలిగా మానవ సేవే మాధవ సేవగా భావిస్తారు. అది మాటల్లోనే కాక చేతల్లో కూడా చూపిస్తూ తనుండే అపార్ట్‌మెంట్‌లోని వారికేకాక బయట వారికి ఉచితంగా వైద్య సలహాలనందిస్తున్నారు. వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తుంటారు. దైవభక్తి, సమాజసేవ, విలువలు కలిగిన ఆమె శ్రీ సత్యసాయి ఆర్గనైజేషన్ పల్లికరిణి సమితి మెడికల్ క్యాంపు డాక్టర్‌గా సేవలందిస్తున్నారు. డాక్టర్లు నిబద్ధతతో వృత్తి నిర్వహణకు కట్టుబడి ఉండాలి. ధన సంపాదన కన్నా మానవత్వానికి విలువనిచ్చి తమను నమ్ముకున్న రోగుల పట్ల దయార్ద్ర హృదయంతో వ్యవహరించాలి. నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చినప్పుడే మన వృత్తిలో మనం సఫలీకృతులమవుతాం. సంతృప్తిని పొందుతాం.

\- డాక్టర్ పద్మప్రియ

కుటుంబం...

పద్మప్రియ భర్త సంజయ్ ఒక కంపెనీలో ఉన్నతోద్యోగి. ఈ దంపతులకు ఒక కుమార్తె.



ఉద్యోగ జీవితం...

తల్లిదండ్రుల ప్రోద్బలంతోనో లేక బాల్యం నుంచి డాక్టర్ కావాలన్న కోరికతోనో పద్మప్రియ వైద్యం పట్ల ఆకర్షితులు కాలేదు. చిన్నతనం నుంచి చదువులో ముందుండే ఆమెకు సైన్స్, లెక్కలు ఇష్టమైన అంశాలు. వాటిల్లో ఎక్కువ మార్కులు సంపాదించిన ఆమెకు మెరిట్‌లో మెడిసిన్‌లో సీట్ లభించింది. తండ్రి ప్రేరణతో మెడిసన్‌లో చేరి డాక్టర్ అయింది. చెన్నైలో యాక్సెంచర్ కంపెనీలో ఫార్మాలో డ్రగ్ సేఫ్టీ ఫిజీషియన్‌గా చేరారు. ఏడు సంవత్సరాల పాటు రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ శాఖలో సేవలందించారు. చెన్నైలోని మేడవాక్కంలో రెండు సంవత్సరాల క్రితం క్లినిక్ నిర్వహించారు. ప్రస్తుతం పద్మప్రియ హెచ్‌సీఎల్‌లో వైద్య పరికరాల భద్రత మీద పనిచేస్తున్నారు. జనరల్ మేనేజర్‌గా 350 మందికి పైగా ఉద్యోగులకు మార్గదర్శకత్వం వహిస్తున్నారు.



రొమాంటిక్ ఫాంటసీ మూవీలో నిత్యామేనన్

దక్షిణాది చిత్రసీమలో ప్రముఖ నటిగా గుర్తింపు పొందిన నిత్యామేనన్ రొమాన్స్, కామెడీతో కూడిన ఫాంటసీ మూవీలో ప్రధాన పాత్రను పోషించనున్నారు. ఇందులో హీరోలుగా వినయ్ రాయ్, 'అరిందుం అరియామలుం' ఫేం నవ్‌దీప్‌తో పాటు ప్రతీక్ బాబర్, దీపక్ పరంబల్ వంటి ప్రముఖ నటీనటులు నటించనున్నారు. దర్శకుడు విష్ణు వర్ధన్ వద్ద సహాయకుడిగా పనిచేసిన కామిని ఈ చిత్రానికి కథను సమకూర్చి దర్శకత్వం వహించనున్నారు. ప్రీతా జయరామన్ ఛాయాగ్రహణం సమకూర్చుతున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలను షణ్ముగరాజా పూర్తి చేయనున్నారు. దక్షిణాదిలో ప్రముఖ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన నిత్యామేనన్... తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషా చిత్రాల్లో నటించారు. ఈ నేపథ్యంలో ఆమె ప్రధాన పాత్రను పోషించే ఈ ఫాంటసీ మూవీని బాస్కిటైం, పాప్టర్ మీడియా సంయుక్తంగా నిర్మించనున్నాయి.

విష్ణు విశాల్ సరసన మమత బైజు!



మలయాళం సూపర్‌హిట్ మూవీ 'ప్రేమలు' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన మమత బైజు త్వరలోనే కోలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. హీరో విష్ణు విశాల్ సరసన ఆమె నటించనున్నారు. 'ప్రేమలు' చిత్రం ద్వారా మమత బైజు.. ఒక్కసారిగా మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం జీవీ ప్రకాష్ కుమార్‌తో కలిసి మమత బైజు నటించిన రెబల్ చిత్రం ఈనెల 22న విడుదలకానుంది. ఈ చిత్రం విడుదలకాకుండానే ఆమెకు వరుస సినిమా అవకాశాలు వస్తున్నాయి. ఇందులోభాగంగా విష్ణువిశాల్ సరసన నటించేందుకు ఆమె సమ్మతం తెలిపినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.

స్త్రీ వేధింపులను పురుష సమాజం ఎలా భరిస్తుంది?

● విజయ్ ఆంటోని
● రంజాన్‌కు 'రోమియో' రిలీజ్



విలేకరులతో మాట్లాడుతున్న విజయ్ ఆంటోని, మృణాలిని రవి

చిత్రజ్యోతి

ఒక స్త్రీ... పురుషుడిని ఏ విధంగా వేధిస్తుంది.. మహిళల వేధింపులను పురుష సమాజం ఏ విధంగా సహిస్తుంది... అన్న ప్రధాన కథాంశంతో 'రోమియో' చిత్రాన్ని తెరకెక్కించినట్టు ఆ చిత్ర హీరో విజయ్ ఆంటోని వెల్లడించారు. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ నిర్మాణంలో మీరా విజయ్ ఆంటోని సమర్పణలో రోమియో రూపొందింది. రంజాన్‌ను పురస్కరించుకుని రెడ్ జెయింట్ మూవీస్ విడుదల చేయనుంది. ఈ చిత్ర బృందం గురువారం రాత్రి నగరంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ... 'ప్రతిభ కలిగిన వినాయక్ వైద్యనాథన్‌ను ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం చేయడం సంతోషంగా ఉంది. హీరోయిన్ మృణాలిని మంచి అమ్మాయి. ఈ సినిమా ప్రమోషన్ కోసం మా ఇద్దరి మధ్య గాసిప్స్ క్రియేట్ చేయాలని అనుకున్నాం. కానీ అవి వర్కౌట్ కాలేదు. తొలిసారి రొమాంటిక్ సినిమాలో నటించా. ఒక స్త్రీ.. ఒక పురుషుడిని ఏ విధంగా వేధిస్తుంది, ఆ వేధింపులను పురుష సమాజం ఎలా భరిస్తుందన్నదే ఈ చిత్ర కథ. కుటుంబ సభ్యులంతా కలిసి చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది' అని అన్నారు. హీరోయిన్ మృణాళిని మాట్లాడుతూ... 'ఈ సినిమా నా సినీ కెరీర్‌లో కీలక మలుపు. మొదటి సారి డబ్బింగ్ చెప్పా. కథని నాకే వ్యక్తిగతంగా రిలేట్ చేసుకున్నా' అని అన్నారు. దర్శకుడు వినాయక్ వైద్యనాథన్ మాట్లాడుతూ... 'ఒక స్త్రీ తన జీవితంలోకి భర్తను ఎలా చూడాలన్నదే ఈ చిత్ర కథ. అవకాశాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో విజయ్ ఆంటోని నుంచి పిలుపు వచ్చింది. రోమియో ఒక లవ్ స్టోరీ. ఒక సక్సెస్‌ఫుల్ వ్యక్తి జీవితంలో మిస్సయ్యే ప్రేమకథ. ఈ స్క్రిప్టులో ట్విస్టులున్నాయి. తన జీవితంలోకి వచ్చే స్త్రీని ఎలా అప్రోచ్ కావాలో తెలియజెప్పే మూవీ' అన్నారు. చిత్ర సంగీత దర్శకుడు భరత్ చంద్రశేఖర్, నిర్మాత ధనుంజయన్ తదితరులు ప్రసంగించారు.

నక్ష సరణ్ ప్రధాన పాత్రలో 'బైక్ ట్యాక్సీ'

న్యూ నార్మల్ ఫిలిమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత కేఎం ఇళంచెళియన్ నిర్మాణంలో గణపతి దర్శకత్వంలో నక్ష సరణ్ ప్రధాన పాత్రలో నటించే 'బైక్ ట్యాక్సీ' చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు సుశీంద్రన్, మహిళా సంగీత దర్శకురాలు ఏ.ఆర్.రెహానా, నటులు కాళి వెంకట్, వయ్యాపురి పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు. నిర్మాత ఇళంచెళియన్ మాట్లాడుతూ... 'దర్శకుడు గణపతి ఇప్పటివరకు తెరకెక్కించిన రెండు చిత్రాలను ప్రేక్షకులు ఆదరించారు. ఈ సినిమా కూడా అదే బాణీలో ఉంటుంది. సమాజానికి సందేశాన్ని ఇచ్చే చిత్రంగా రూపొందిస్తున్నాం. హీరోయిన్ నక్ష సరణ్‌కు ఈ సినిమా మంచి టర్నింగ్ పాయింట్‌గా ఉంటుంది' అని అన్నారు. దర్శకుడు గణపతి మాట్లాడుతూ... 'చిత్రపరిశ్రమలో నెలకొన్న ఇలాంటి పరిస్థితుల్లోనూ మూడు చిత్రాలకు దర్శకత్వం వహించడం ఎంతో కఠినమైన విషయమో మీకందరికీ తెలుసు. అనేక కష్టాలను అధికమించి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నా. బైక్ ట్యాక్సీ నడిపే ఒక మహిళ ఒక రోజు ఆరుగురు వ్యక్తులను కలుసుకుంటారు. "ఒక రోజు ఆరుగురు వ్యక్తులు.. ఆరు స్టోరీలు" ఇదే ఈ సినిమా స్టోరీ' అని వెల్లడించారు. హీరోయిన్ నక్ష మాట్లాడుతూ... 'మమ్మల్ని అభినందించేందుకు ఇక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఒక మంచి మహిళా కథా పాత్రకు ఇచ్చారు. ఆయన రాసిన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తా' అని పేర్కొన్నారు.



'బైక్‌ట్యాక్సీ' పూజా కార్యక్రమం

నేత్రపర్వం అంకాళపరమేశ్వరి రథోత్సవం



రథోత్సవంలో అమ్మవారి వేషధారణలతో నృత్యం చేస్తున్న హిజ్రాలు

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరులోని అత్యంత ప్రాచీనమైన అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మాసి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం వేలాదిమంది భక్తుల నడుమ కనుల పండువగా జరిగింది. ఈ ఆలయంలో యేటా తమిళ మాసి నెల మహాశివరాత్రి నుంచి 13 రోజులపాటు మాసి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు మాసి బ్రహ్మోత్సవాలు ఈనెల 8న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మరుసటి రోజు శ్మశాన కొల్లై, 12న అగ్నిగుండ ప్రవేశం తదితర వేడుకలు జరిగాయి. ప్రతి రోజూ అమ్మవారు వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తున్నారు.ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శుక్రవారం మధ్యాహ్నం వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని వేకువజాము ఆలయాన్ని తెరిచి గర్భాలయంలోని అమ్మవారికి, పరమేశ్వరుడికి పాలు, పెరుగు, చందనం, పసుపు, విభూది, కుంకుమ, నారికేళ జలం, పంచామృతం, తేనె, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత అంకాళపరమేశ్వరికి స్వర్ణ కవచాన్ని ధరింపజేసి మహాదీపారాధన నిర్వహించారు. ఆ తర్వాత ఆలయంలోని ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ఆశీనులు కావించారు. రథం బయలుదేరటానికి ముందు ఆలయ అధికారులు, ఊరి పెద్దలకు ఆలయ మర్యాదలు జరిపారు. అటు పిమ్మట రథం ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను భక్తులు చేతపట్టుకుని లాగారు. ఆ సమయంలో భక్తులంతా అంకాళపరమేశ్వరీ అంటూ నినాదాలు చేశారు. దారి పొడవునా భక్తులు తాము పండించిన కూరగాయలు, పండ్లను, ధాన్యాన్ని, కుడుములు, చిల్లర నాణేలను రథంపై చల్లి మొక్కు చెల్లించుకున్నారు. రథత్సోవ మార్గంలో కొంతమంది భక్తులు, హిజ్రాలు కాళి, పరమేశ్వరి, మారియమ్మ వేషాలు వేసి డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆలయ నిర్వాహకులు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు చల్లటి మజ్జిగ, పానకం, శీతలపానీయాలు పంపిణీ చేశారు. పలుచోట్లు భక్తజన సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు.. అంకాళపరమేశ్వరి (ఇన్‌సెట్‌లో)



నెల్లయప్పర్ ఆలయంలో పంగుని ఉత్తిరం ఉత్సవాలు ప్రారంభం

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుప్రసిద్ధ శివాలయాల్లో ఒకటిగా, శైవభక్త శిఖామణి జ్ఞాన సంబంధర్ కీర్తించిన దివ్యక్షేత్రంగా, వరిధాన్యానికి కంచెగా నిలిచిన ఈ ప్రాంతానికి తిరునల్వేలి అనే పేరు రావడానికి ప్రధాన కారకుడైన స్వామి నెల్లయప్పర్ కొలువైన ఆలయంలో పంగుణి ఉత్తిరం ఉత్సవాలు ధ్వజారోహణంతో శుక్రవారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము 5గంటలకే ఆలయాన్ని తెరచి స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు, దీపారాధన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ధ్వజపటాన్ని మంగళవాయిద్యాలు, శైవాగమ పండితుల మంత్రోచ్చాటనల నడుమ ఆలయ వీధుల్లో ఊరేగించారు. అటు పిమ్మట ఆలయ ధ్వజానికి దీపారాధన గావించారు. గర్భాలయం ఎదుట స్వర్ణ ధ్వజస్తంభంపైకి ఆలయ ధ్వజపటాన్ని ఆరోహణం గావించారు. ఆ సందర్భంగా ధ్వజస్తంభానికి సుగంధ ద్రవ్యాలు, చందన తాపడాలు జరిపి, పాలు, వెన్న, పెరుగు, నారికేళ జలం, అన్నం, విభూది, చందనంతో అభిషేకాలు నిర్వహించారు. ఈ పది రోజుల ఉత్సవాల్లో నాలుగో రోజు రాత్రి స్వామి, అమ్మవారు, పంచమూర్తులు ప్రధాన వీధుల్లో విహరిస్తారు. పదో రోజు రాత్రి వెయ్యి కాళ్ల మండపంలో పంగుణి ఉత్తిరం సెంగోల్ సమర్పించే ఉత్సవం జరగనుంది.



ధ్వజస్తంభానికి మహాదీపారాధన చేస్తున్న ప్రధానార్చకులు

సిరువాపురికి పోటెత్తిన భక్తులు



సిరువాపురి ఆలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పంగుణి కృత్తిక సందర్భంగా పెరియపాళయం సమీపం సిరువాపురి బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి శుక్రవారం ఉదయం వేల సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఈ ఆలయంలో మంగళవారాలు, కృత్తిక దినాల్లో వేలాదిమంది భక్తులు తరలిరావడం ఆనవాయితీ. ఆరు మంగళవారాల పాటు ఈ ఆలయంలో నేతి దీపాలు వెలిగిస్తే వివాహ ఆటంకాలు తొలగుతాయని, సంతాన భాగ్యం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నేపథ్యంలో శుక్రవారం పంగుణి కృత్తికను పురస్కరించుకుని వేకువజామునే సిరువాపురి ఆలయానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం 1గంట వరకూ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించడానికి రెండు మూడు గంటలపాటు భక్తులు క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

హోసూరులో కాంచీపురం వరమహాలక్ష్మి శిల్క్స్ షోరూం

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు మూకండపల్లిలో సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ (ఎస్ఎస్‌కేఎల్) వారి కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ షోరూం ఏర్పాటైంది. దీనిని శుక్రవారం శ్రీ సెందలంగార షెన్బగ మన్నార్ సంపత్‌కుమార రామానుజ జీయర్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఇది తమిళనాట ఎస్ఎస్‌కేఎల్ వారి 9వ స్టోర్ కాగా, మొత్తమ్మీద 60వది కావడం విశేషం. ఈ సందర్భంగా సంస్థ ఎండీ ప్రసాద్ చలవాడి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో బలమైన ఉనికిని కలిగి ఉన్న తమ సంస్థ మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేపట్టామన్నారు. అన్ని వర్గాల వారికి అనువైన, సంప్రదాయ, ఆధునిక మేలుకలయికతో అందరినీ ఆకట్టుకునేలా దుస్తులను అందుబాటులో ఉంచామని వివరించారు.



షోరూం ప్రారంభోత్సవ దృశ్యం